# బల్దియాలో దొంగలు పడ్డారు..!

- ఫ్యాన్లు, నల్లాలు, ఏసీ కాపర్ వైర్లు చోరీ
- పాత ఫర్నిచర్, ఏసీలు కూడా
- వరుసగా జరుగుతున్న దొంగతనాలు
- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- సెక్యూరిటీ నిఘా అంతంతే



కేంద్ర కార్యాలయ భవనంలో సీసీ కెమెరాలు

**హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయంలోని ఏసీల కాపర్ పైపులు, మరుగుదొడ్లలోని నల్లాలు, లైట్లు, కంప్యూటర్ల వద్ద స్పీకర్లు, కీబోర్డులు దొంగలించి అమ్ముకుంటున్నారు. కార్యాలయ ప్రాంగణంలో ఉంచిన పాత ఫర్నిచర్, ఏసీలూ చోరీకి గురైనట్టు ఓ అధికారి చెప్పారు. వాస్తవంగా పాత ఫర్నీచర్, ఇతర వస్తువులను వేలం వేసి అమ్మాల్సి ఉండగా.. సంబంధిత అధికారులు నెలల తరబడి పట్టించుకోకపోవడంతో దొంగల పాలయ్యాయి. కార్యాలయం చుట్టూ, ప్రతి అంతస్తులో సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పని చేయడం లేదు. ఇప్పటికే పలుమార్లు చోరీలు జరిగినా.. ఒక్కరినీ గుర్తించలేదు. దొంగతనాలకు సంబంధించి అధికారులు రెండు, మూడు పర్యాయాలు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. అయినా చోరీలు ఆగక పోగా.. క్రమేణా పెరుగుతున్నాయి. సీసీ కెమెరాలతోపాటు 24 గంటలూ కార్యాలయంలో సెక్యూరిటీ ఉంటుంది. అయినా చోరీలు జరుగుతుండడం గమనార్హం. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణంగా కార్యాలయ పని వేళలు. అయినప్పటికీ.. కొందరు అధికారులు సమావేశాలు, ఇతర పనుల కోసం రాత్రి ఏడెనిమిది గంటల వరకు, ఒక్కోసారి అంతకంటే ఎక్కువ సమయం ఉంటారు.

అధికారులు, ఉద్యోగులు వెళ్లిన అనంతరం విభాగాల వారీగా, ప్రధాన గేట్లకు ఎక్కడికక్కడ తాళాలు వేయాలి. భవనంలోకి వెళ్లేందుకు మేయర్, కమిషనర్ వైపున్న ద్వారాలను, ప్రధాన గేట్లూ అర్ధరాత్రి 11, 12 గంటల వరకు తెరిచే ఉంచుతున్నారు. ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఓ వివాదానికి సంబంధించి కేసు నమోదు కాగా.. పోలీసులు జీహెచ్ఎంసీ ఐటీ విభాగం అధికారులను సీసీపుటేజీ అడిగారు.

సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఐటీ విభాగం చెప్పడంతో పోలీసులు తెల్ల మొహం వేశారు. కెమెరాలు పనిచేయకుంటే మీ సంస్థలో జరిగే చోరీల బాధ్యులనూ ఎలా గుర్తిస్తామని ప్రశ్నించారు. రెండు, మూడేళ్లకోమారు కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తో న్న అధికారులు.. వాటి నిర్వహణకూ రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. అయినా అవి సక్రమంగా పని చేయక పోవడం గమనార్హం.

## విద్యారుణ శిబిరాలు నిర్వహించాలి

- బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** విద్యారుణ శిబిరాలు నిర్వహించి నిరుపేద తల్లిదండ్రులకు తక్షణమే సాయం అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాలు, సాధింపులపై కలెక్టర్ సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో విద్యారుణాలు రూ.1203.84 కోట్లు లక్ష్యంగా ఉండగా.. ఇప్పటివరకు కేవలం రూ.131.95 కోట్లు (10.96 శాతం) మాత్రమే అందించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్యాంకులు తక్షణమే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు విద్యా రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.55,908.22 కోట్లు కాగా.. రూ. 37,185.65 కోట్లు సాధించడం జరిగిందని, బ్యాంకులు నెల వారీగా టార్గెట్ నిర్దేశించుకుని అర్హులకు రుణాలను అందించాలని సూచించారు. స్వానిధి ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సకాలంలో రుణాలు అందించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం ఆర్.గోమతి, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం, ఎల్‌డీఎం జీఎం సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్లు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



దివ్యాంగుల సంస్థ కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపిస్తున్న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, తదితరులు

## హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

**రాంనగర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి):** అంధుల దైవం హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న హెలెన్ కెల్లర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన విగ్రహన్ని ప్రతిష్ఠించాలన్నారు. మలక్‌పేటలోని అంధుల ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజీలో తగిన వసతి కల్పించాలని కమిషనర్‌ను కోరామన్నారు. దివ్యాంగులకు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ నేషనల్ కో-కన్వీనర్లు వి. భారతి, సభ్యులు వెంకటేష్ గౌడ్, కిషోర్, ఎస్.ఇ.ఏ.ఉద్దీన్, వాసు తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

## విద్యార్థులకు స్కూల్ యూనిఫారమ్, పుస్తకాలు అందజేత

**చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** పిల్లలు చక్కటి విద్యను అభ్యసించి వృద్ధిలోకి వచ్చేందుకు బడిలో టీచర్లు నేర్పించే విద్యతోపాటు పిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ముఖ్యమని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. ఎస్ఆర్‌టీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫారమ్, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేయడానికి కార్పొరేటర్‌గా ముందుంటామని ఆమె తెలిపారు.

కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కార్మిక శాఖలో వెబ్ వెరిఫికేషన్ సిస్టమ్ ప్రారంభం

**చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** కార్మికశాఖలో వెబ్ వెరిఫికేషన్ సిస్టమ్ ప్రారంభమైంది. శుక్రవారం దీన్ని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాణి కుముదిని కార్మికశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య చాంబర్‌లో ప్రారంభించారు. దీనివల్ల మాన్యువల్ వెరిఫికేషన్‌తోపాటు ఒక్క క్లిక్‌తో బర్త్ అండ్ డెత్ క్లెయిమ్‌లు తెలుసుకోవడంతో ఎంతో సమయం ఆదా అవుతుందని రాణి కుముదిని వివరించారు. వెబ్ వెరిఫికేషన్ వల్ల ఫేక్ క్లెయిమ్‌లను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు.

## ఆటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యం




పవన్

**అంబర్‌పేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** ఇంట్లో నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... బాగ్‌అంబర్‌పేట సీఈ కాలనీలో నివాసం ఉండే బిందు కుమారుడు పవన్ (11) జామై ఉస్మానియా పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. అతడు మానసికంగా కూడా సరిగ్గా లేనట్లు తెలిసింది. అతని తల్లి బిందు ఇళ్లల్లో పనిచేస్తుంది. ఈ నెల 12వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటకి రాలేదు. పవన్ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి బిందు శుక్రవారం అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

**బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** చింత చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన రాందాసు(58) కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఫుట్‌పాత్‌పై ఇస్త్రీ షాపు నడుపుతున్నారు. దగ్గరనే ఉన్న ఓ ఇంట్లో చింత చెట్టు మామిడి చెట్టు ఉంది. చింత చెట్టు ఎక్కి చింతకాయ తెంపుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్రగాయమై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎస్‌యూ నేతలు

## అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోండి

**హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి):** అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్(ఐఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఐఎస్‌యూ నేతలు శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు మాట్లాడుతూ..అటానమస్ హోదా తెచ్చుకున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు రూ.2 లక్షలు మొదలుకొని రూ.26 లక్షల దాకా డొనేషన్ల కింద దోచుకుంటున్నాయన్నారు. మేనేజ్‌మెంట్ కోటా భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకుండానే కాలేజీల యాజమాన్యాలు సీట్లను భర్తీ చేసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల అడ్మిషన్లపై పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ లింబాద్రి సానుకూలంగా స్పందించారని, మేనేజ్మెంట్ కోటా సీట్లను కూడా ఈ ఏడాది కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారని నాగరాజు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో ఐఎస్‌యూ రాష్ట్ర నాయకులు పి.వెంకటేష్‌గౌడ్, ముత్యాల సతీష్ కుమార్ తదితరులున్నారు.

## రెండు తెలుగు రాష్ట్రాల్లో కుసుమ ధర్మన్న కళాపీఠాలు ఏర్పాటు చేయాలి

**చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** కుసుమధర్మన్నను భవిష్యత్‌తరాలు గుర్తుంచుకునేలా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆయన కళాపీఠాలు ఏర్పాటు చేయాలని ఇందుకోసం ప్రభుత్వాలకు వినతి చేశామని ధర్మన్న మనుమరాలు కుసుమ రాధ చెప్పారు. వివక్షత ఎదుర్కొంటున్న దళితుల కోసమే కాకుండా సమాజంలో ఉన్న పలు రుగ్మతలపై అవిశ్రాంతంగా ధర్మన్న పోరాడారని ఆమె వివరించారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా దళిత ఉద్యమకారులు కుసుమ ధర్మన్న యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. రాధ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం భాగ్యరెడ్డి వర్మతో కలిసి హైదరాబాద్ నగరంలో పలు ఉద్యమ సభలు జరిపారని గుర్తుచేశారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న రచనలు తక్కువ చేసినా కూడా ఆ రచనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయని వివరించారు. ఆయన జీవితకథ సిలబస్‌లో ఉంచాలని కోరారు. ఎందరో మహానుభావులను ఈ తరానికి పరిచయం చేసే యత్నం చేస్తున్నామన్నారు.



సాయిబాబాకు పురస్కారం బహూకరిస్తున్న అతిథులు

## సుమధుర స్వరకర్త సాయిబాబా

**చిక్కడపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి):** దశాబ్దాలుగా ఆకాశవాణిలో కవుల గీతాలకు సంగీతాన్ని అందించిన సుమధుర స్వరకర్త సాయిబాబా అని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. బోయి బీమన్న సాహితీనిధి ఆధ్వర్యంలో విజయపల్లవి బోయి పేరిట ప్రముఖ సంగీత దర్శకుడు పీవీ సాయిబాబాకు సంగీత పురస్కారం బహూకరణ సభ జరిగింది. వేణుగోపాలచారి పాల్గొని నగదు పురస్కారంతోపాటు సాయిబాబాను సత్కరించి మాట్లాడుతూ విజయపల్లవి ప్రభుత్వ ఉన్నతాధికారిణిగా సితార్ నిపుణగా గాయనిగా పేరు సంపాదించుకుని కరోనాకాలంలో జీవితం చాలించిందని చెప్పారు. రచయిత్రి శోభాపేరిందేవి, సాహితీవేత్త నిత్యానందరావు, పురస్కారప్రదాత హైమవతిబీమన్న బోయి, సుంకర సత్యనారాయణ, నటి సుమిత్రపంపన, సురేందర్, యాదగిరి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



బీసీ గురుకుల సెక్రటరీ సైదులుకు వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, తదితరులు

## బీసీ గురుకులాల సంఖ్య పెంచాలి

**కవాడిగూడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాలల సంఖ్య పెంచాలని కోరుతూ బీసీ గురుకుల సెక్రటరీ సైదులుకి బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న గురుకుల పాఠశాలలు సరిపోవడం లేదని, దీంతో బీసీ కులానికి చెందిన వారికి నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ప్రతి మండలానికి ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. గురుకులాల్లో వర్కర్స్, టీచర్లను పెంచాలని, ప్రతి విద్యార్థికి ల్యాప్‌టాప్ ఉచితంగా అందజేయాలని, డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్, విద్యార్థి సంఘం కార్యదర్శి ఇంద్రం పాల్గొన్నారు.

## హెబ్రోన్‌చర్చిలో ఆధిపత్యపోరు

- పీఎస్‌కు చేరిన వివాదం

**చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** గాంధీనగర్ డివిజన్‌లోని గోల్కొండ చౌరస్తాలో ఉన్న హెబ్రోన్ చర్చిలో చర్చి నిర్వహణపై శుక్రవారం ఆధిపత్యపోరు జరిగింది. చర్చి ట్రస్ట్ వారు చర్చిలో ప్రార్థనలు జరుపుకుంటామని కొందరు ఉదయం చర్చిలోకి రావడంతో చర్చి నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న సొసైటీ వారు అడ్డుకున్నారు. ప్రార్థనల పేరుతో చర్చి నిర్వహణను ట్రస్ట్‌వారు బలవంతంగా లాక్కుంటారని సొసైటీ వారు ఆరోపించారు. విషయం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో పోలీసులు చర్చివద్దకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ట్రస్ట్ వారు తాముకేసు గెలిచామని చర్చి నిర్వహణ బాధ్యత తమదేనని పేర్కొంటుండడం, తమదే నిర్వహణ బాధ్యత అని ప్రస్తుతం చర్చిని నిర్వహిస్తున్న సొసైటీ వారు వాదించడంతో ఇరువర్గాల వద్ద ఉన్న పేపర్లు తేవాలని చిక్కడపల్లి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లు సూచించారు.



సుందరయ్యపార్కు వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

## నీట్ అభ్యర్థుల గ్రేస్ మార్కులు రద్దు చేయొద్దు

- ఎస్ఎఫ్ఐ నిరసన ప్రదర్శన

**రాంనగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** నీట్ అభ్యర్థుల గ్రేస్ మార్కులు రద్దు చేయడం నిరసిస్తూ శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్. మూర్తి, నాగరాజులు మాట్లాడుతూ దేశంలో నీట్ పరీక్ష గందరగోళంపై కేంద్రం గ్రేస్ మార్కులు పొందిన వారి మార్కులు మాత్రమే రద్దు చేసి ఈ నెల 23న రీ ఎగ్జామ్ నిర్వహించి ఈ నెల 30న ఫలితాలు ఇస్తామని సుప్రీంకోర్టు, కేంద్రం పేర్కొనడం సిగ్గుచేటని అన్నారు. పేపర్ లీకేజీపై విచారణ జరిపించి దోషులను నివారించాలని వారు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, మమత, వీరభద్రం, అశోక్‌రెడ్డి, ప్రశాంత్, రమ్య. లెనిన్, శ్రీకాంత్, దారాసింగ్, రమేష్, వినోద్, అరవింద్, మహేష్, నరహరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

## జీహెచ్‌ఎంసీ విస్తరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

**నల్లకుంట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిని విస్తరింప చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిలు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీలో ముస్లింల ప్రాబల్యం కొనసాగడానికే 21 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను విలీనం చేయడానికి కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిని విస్తరిస్తే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని, వ్యవసాయ భూములు అన్యాక్రాంతమవుతాయన్నారు. చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబడి పెంచుకునేందుకు, ఎంఐఎం పార్టీని సంతృప్తి పరిచేందుకే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని, ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



రామోజీరావుకు నివాళులర్పిస్తున్న సీనియర్ జర్నలిస్టులు

## రామోజీరావు సేవలు మరువలేనివి

**చిక్కడపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** మీడియా రంగంలో అగ్రగామిగా నిలిచిన రామోజీరావు ఉన్నత విలువలతో కూడిన జర్నలిజాన్ని అందించిన అక్షరయోధుడని పలువురు సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల నేతలు కొనియాడారు. వివిధరంగాలతోపాటు మీడియా రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. శుక్రవారం త్యాగరాయగానసభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్ట్, హైదరాబాద్ జర్నలిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో రామోజీరావు సంతాపసభ నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు. సీనియర్ పాత్రికేయుడు, హాస్యబ్రహ్మ శంకరనారాయణ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యుజె జాతీయ కార్యదర్శి ఆనందం, హెచ్‌యుజె కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొని రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## రైల్వే పోలీసుల అప్రమత్తం

- లక్షలాది విలువైన చోరీ సొత్తు స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ రైల్వే (ఆర్పీఎఫ్) పోలీసులు మే నెలలోనే పలు కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి లక్షలాది రూపాయాల విలువైన సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పంచామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రధానంగా 'ఆపరేషన్ యాత్రిసురక్ష' ద్వారా 53 కేసులను నమోదు చేసి 37 మంది నేరస్తులను అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ.29.58 లక్షల విలువైనసొత్తును స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. అలాగే 'ఆపరేషన్ అమానత్' కార్యక్రమం ద్వారా 243 మంది ప్రయాణికులు పోగొట్టుకున్న దాదాపు రూ.57లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని యజమానులకు అప్పగించినట్టు తెలియజేశారు. ఇక ఆపరేషన్ నార్కోస్ ద్వారా 8 మందిని అరెస్టు చేసి దాదాపు రూ.38 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. అలాగే ఆపరేషన్ నాన్ హే ఫారిస్టే కింద వివిధ కారణాలతో ఇంటి నుండి తప్పిపోయిన/పారిపోయిన 133మంది (102 బాలురు, 31మంది బాలికలు) పిల్లలను గుర్తించి వారి తల్లి తండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా -ఆపరేషన్ ఆహ్ట్ కింద 18 మంది మానవ అక్రమరవాణాదారుల బారి నుంచి 58 మందిని (52 మంది బాలురు, మరో 6 గురు బాలికలు)రక్షించినట్టు తెలిపారు. దీంతోపాటు 'ఆపరేషన్ సటార్క్' 21 కేసులు నమోదు చేసి 11మందినిందితులను అరెస్టు చేసి వారి నుంచి రైళ్లలో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3,94,092/- విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు. ఆపరేషన్ ఉపలబ్ద్ కింద రూ.2,30,779 విలువైన 129 లైవ్ రైల్వే టికెట్లను స్వాధీనం చేసుకుని 27 మంది దళారులను అరెస్టు చేసి 27 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. సీసీటీవీ సాంకేతికతను ఉపయోగించి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.40 లక్షల విలువైన దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆపరేషనల్ రైల్ సురక్ష కింద 41 కేసులను నమోదు చేసి రూ.1.62 లక్షల దొంగసొత్తును స్వాధీనం చేసుకున్నట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలిపారు.



కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిని సత్కరిస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రరెడ్డి, తదితరులు

## ఉన్నత విద్య అభివృద్ధికి సహకారం అందించాలి

- కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రికి రాష్ట్ర బీజేపీ నేతల వినతి

**బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణలో ఉన్నత విద్యారంగం అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విన్నవించారు. శుక్రవారం ఢిల్లీలోని శాస్త్రీభవన్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కేంద్ర మంత్రిని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రరెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, సహ కోశాధికారి ఓ. శ్రీనివాస్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్, చంద్రశేఖర్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్యతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌ను మరింత విస్తృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలను బలోపేతం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అశోక్

## బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

- అంబర్‌పేట సీఐ అశోక్

**అంబర్‌పేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** ముస్లింలు త్యాగానికి గుర్తుగా జరుపుకునే బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని అంబర్‌పేట పీఎస్ సీఐ అశోక్ కోరారు. అంబర్‌పేట పీఎస్‌లో శుక్రవారం పీఎస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దీత ప్రాంతాలలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయ్, పోలీసు సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది, పీఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

**ముషీరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** బక్రీద్ పండుగకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్, ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ మైనారిటీ కమిటీ నాయకులు అక్లక్ హుస్సేన్, ఖదీర్‌లు జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ (డీఎంసీ) ఖాదర్ మోహిన్‌ఉద్దీన్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

## ఎంసీహెచ్‌కాలనీలో చెట్ల కొమ్మల తొలగింపు

**ముషీరాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్ వెస్ట్ ఎంసీహెచ్ కాలనీ, పార్శీగుట్ట ప్రాంతాలలో వి ద్యుత్ తీగలపై వేళాడుతున్న చెట్ల కొమ్మలను శుక్రవారం ఉద్యానవన శాఖ సిబ్బం ది తొలగించారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, నాయకులు శ్రీనివాస్, ఉద్యానవన శాఖ అధికారులతో మాట్లాడారు. చిన్నపాటి వర్షం, ఈదురుగాలులకు చెట్ల కొమ్మ లు విద్యుత్ తీగలపై పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యుత్ తీగలపై వేళాడుతున్న చెట్ల కొమ్మలను కట్ చేసి వాహనాలలో తరలించారు.



ప్రొఫెసర్ వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొండ దేవయ్య, మహేందర్‌కుమార్, తదితరులు

## మున్నూరుకాపు ట్రస్ట్ బోర్డు ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**బర్కత్‌పుర, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):** కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డుకు సంబంధించిన ఆస్తులపై చైర్మన్ శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, గ్రేటర్ అధ్యక్షుడు ఆర్.వి. మహేందర్‌కుమార్ పటేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రావ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో జరిగిన మున్నూరుకాపు సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు మణికొండ వెంకటేశ్వరరావు, మంగళారపు లక్ష్మణ్‌లు వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆస్తులు 200 కోట్ల రూపాయలు ఉన్నాయని అవి అన్ని తమవేనని ప్రకటించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జీవో 60 ప్రకారం వేతనాలివ్వాలి



బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన కార్మికులు

**హైదరాబాద్ సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి):** బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అథారిటీ (బీపీపీఏ) పరిధిలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలివ్వాలని డిమాండ్ చేస్తూ... సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం బీపీపీ ఓఎస్డీ చంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలు ప్రభుత్వ శాఖల్లో అమలు చేసిన్నట్టుగానే బీపీపీఏ అమలు చేయాలని రెండేళ్లుగా కార్మికులు కోరుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే వేతనాలు పెంచేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సుమిత్ర, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, యూనియన్ నాయకులు ఊర్మిళ, స్వప్న, శివ, తాహేర బేగం, అనిత తదితరులు పాల్గొన్నారు.